## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.
- భారత ఉత్పత్తులంటే ప్రపంచ వ్యాప్తంగా అత్యంత నాణ్యమైన ఉత్పత్తులనే గుర్తింపు రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్” కార్యక్రమంలో ఆకాంక్షించారు.
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన “పద్మ” అవార్డులను కేంద్ర ప్రభుత్వం మొత్తం 131 మందికి ప్రకటించింది.
- భారత్, యూరోపియన్ యూనియన్ (EU) మధ్య గత ఏడాది కాలంగా సాగుతున్న నిర్మాణాత్మక చర్చలు చివరిదశకు చేరుకున్నాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు.
- భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడవ టీ-20 క్రికెట్ మ్యాచ్ గువహాటి వేదికగా జరుగుతోంది.

=======================

దేశ ఆర్థిక భవిష్యత్‌ను తీర్చిదిద్దే ప్రయాణంలో `ఆత్మ నిర్భరత`, `స్వదేశీ` భావనలే దిక్సూచి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ఈరోజు జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భారత్ స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. జీఎస్టీ హేతుబద్ధీకరణ, కార్మిక సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయని తెలిపారు. గత సంవత్సరం ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం జరిపిన `ఆపరేషన్ సింధూర్` దాడులను రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గణతంత్ర దినోత్సవం అనేది దేశభక్తిని చాటుకోవడానికి ఒక గొప్ప సందర్భమని ద్రౌపది ముర్ము పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ యవనికపై సగర్వంగా నిలుస్తున్న వేళ.. నాణ్యత విషయంలో మనం రాజీపడకూడదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 2026 సంత్సరంలో తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఈరోజు ఆయన ప్రసంగించారు. మేడిన్ ఇండియా ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా అత్యంత నాణ్యమైన ఉత్పత్తులనే గుర్తింపు రావాలని ఆకాంక్షించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా యువతకు ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడం జీవితంలో ఒక గొప్ప మైలురాయని, ఓటరే ప్రజాస్వామ్యానికి ప్రాణమని పేర్కొన్నారు. 2016లో ప్రారంభమైన 'స్టార్టప్ ఇండియా' ప్రస్థానం నేడు భారత్‌ను ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థగా మార్చిందని ప్రధాని గుర్తు చేశారు. 'జీరో డిఫెక్ట్ - జీరో ఎఫెక్ట్' మంత్రంతో వికసిత్ భారత్ వైపు అడుగులు వేయాలని పారిశ్రామికవేత్తలను కోరారు.

(వాయిస్ 25 సెకన్లు)

భారతదేశ ఆత్మ మన సామాజిక ఐక్యతలోనూ.. కుటుంబ వ్యవస్థలోనూ ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. కుటుంబం, సమాజం ఏకమైతే ఏ సవాలునైనా అధిగమించవచ్చని ప్రధాని స్పష్టం చేశారు. జల సంరక్షణలో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ప్రజలు చూపుతున్న చొరవను ప్రధానమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అరుణాచల్ ప్రదేశ్ యువత స్వచ్ఛత విషయంలో అద్భుతాలు చేస్తున్నారని తెలిపారు. యువత ఒక బృందంగా ఏర్పడి పలు పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, ఇప్పటివరకు వీరు 11 లక్షల కిలోల చెత్తను తొలగించారని వెల్లడించారు. యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమని చెప్పడానికి ఇది నిలువెత్తు సాక్ష్యమని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూ ఢిల్లీలో జరగనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డీ కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెయిర్ లెయన్లకు ఈరోజు ఢిల్లీ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు వీరు భారత్‌లో పర్యటిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఈ రోజు 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకున్నారు. "నా భారత్ – నా ఓటు" అనే నినాదంతో పౌరుల చైతన్యాన్ని చాటుతూ వేడుకలు జరిగాయి. ఓటు వేయడం అనేది కేవలం రాజకీయ వ్యక్తీకరణ మాత్రమే కాదని, అది దేశ ఎన్నికల వ్యవస్థపై పౌరులకున్న అచంచల విశ్వాసానికి ప్రతీక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి మాట్లాడుతూ.. ఓటు ద్వారా పౌరులు తమ ఆకాంక్షలను తెలియజేస్తారని, నేటి ఓటర్లే రేపటి దేశ భవిష్యత్‌కు రూపశిల్పులని కొనియాడారు. ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రతి పౌరుడికి గర్వకారణమని, దానిని ఒక వేడుకలా జరుపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన `పద్మ` అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఈరోజు ప్రకటించింది. 2026 ఏడాదికి గానూ మొత్తం 131 మందికి ఈ అవార్డులు లభించాయి. ఇందులో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. అవార్డు గ్రహీతల్లో 19 మంది మహిళలు ఉండగా, 16 మందికి మరణానంతరం

పురస్కారాలు దక్కాయి. బాలీవుడ్ దివంగత నటుడు ధర్మేంద్ర సింగ్ డియోల్ కు మరణానంతరం పద్మ విభూషణ్ ప్రకటించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి దివంగత వి.ఎస్. అచ్యుతానందన్, జస్టిస్ కె.టి. థామస్, ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు ఎన్. రాజం, సాహిత్యవేత్త పి. నారాయణన్ పద్మ విభూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట ముద్ర వేసిన 113 మందికి పద్మశ్రీ దక్కింది. తెలుగు రాష్ట్రాల నుంచి 13 మందికి పద్మ పురస్కారాలు లభించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, యూరోపియన్ యూనియన్ (EU) మధ్య గత ఏడాది కాలంగా సాగుతున్న నిర్మాణాత్మక చర్చలు ఫలప్రదమైన ముగింపునకు చేరుకున్నాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. భారత పర్యటనకు వచ్చిన యూరోపియన్ ట్రేడ్ కమిషనర్ మారోస్ సెఫ్కోవిచ్‌కు ఆయన ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలపై ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. అనంతరం పీయూష్ గోయల్ మాట్లాడుతూ... భారతదేశానికి యూరోపియన్ యూనియన్ అత్యంత కీలకమైన ఆర్థిక భాగస్వామి అని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ మౌలిక సదుపాయాల కల్పనలో అసోం రాష్ట్రం సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని `ప్రగతి` (PRAGATI) పర్యవేక్షణలో ఏకంగా 4 లక్షల 86 వేల 698 కోట్ల రూపాయల వ్యయంతో 111 భారీ ప్రాజెక్టులు ఇక్కడ రూపుదిద్దుకుంటున్నాయి. రాష్ట్రంలో చేపట్టిన మొత్తం 111 ప్రాజెక్టులలో ఇప్పటికే 81 వేల 871 కోట్ల రూపాయల పెట్టుబడితో 46 ప్రాజెక్టులు పూర్తికాగా, 4.04 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో 65 ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 25 ప్రాజెక్టులను స్వయంగా ప్రధానమంత్రి 'ప్రగతి' వేదిక ద్వారా పర్యవేక్షిస్తున్నారు. 'ప్రగతి' పర్యవేక్షణలో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించిన 48 సమస్యల్లో 47 ఇప్పటికే కొలిక్కి వచ్చాయి. ఈ సమర్థవంతమైన నిర్వహణ వల్ల అసోం నేడు పారిశ్రామిక, లాజిస్టిక్స్, కనెక్టివిటీ రంగాల్లో దేశానికే ఒక మోడల్‌గా నిలుస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడవ టీ -20 క్రికెట్ మ్యాచ్ గువహటి వేదికగా జరుగుతోంది. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్.. భారత్ కు 154 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

2026 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, జైళ్ల శాఖల్లో విశేష సేవలందించిన 982 మంది సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం పతకాలతో గౌరవించింది. విధి నిర్వహణలో అసాధారణ సాహసాలు ప్రదర్శించిన వారికి, నిరుపమాన సేవలు అందించిన వారికి ఈ పురస్కారాలను ప్రకటించింది. ధైర్యసాహసాలు కనబరిచిన 125 మంది సిబ్బందికి 'మెడల్ ఫర్ గ్యాలంట్రీ' (శౌర్య పతకం) దక్కింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =